ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక :

# పగ

రచన :
"తారక"

పై కండువా తీసుకుని, "ఓసేవ్! తలుపేసుకో" మని, భార్యకు పురమాయించి, నారాయణ, వీధిన బడ్డాడు. పెళ్లివారెళ్ళిం తరువాత, పెళ్ళి యిల్లు లాగున్నాయి నిర్మానుష్యంగా వీధులు!

చంద్రుడు, పాలిపోయి పల్చని బూడిద లాంటి వెన్నెల పోస్తున్నాడు లోకంమీద!

తడబడుతున్న కాళ్లను, నిలదొక్కుకుంటూ, వెనకా ముందూ చూసుకున్నాడు, తన్నెవరూ చూట్టం లేదుగదా అని!

దూరాన ఓ కుక్క, లేచి వొళ్లు విదలించుకొని, ఎటో పోతున్నది. ఉత్తతీతువు పిట్ట ప్రాణంపోయ్యేలా అరుస్తోంది.

నారాయణ ముందుకే పోతున్నాడు. కార్తీకపు చలి మెల్లగా, వొంటికి తాకుతున్నది. పై కండువా తీసి, తలకు చుట్టుకున్నాడు.

"ఒరేయ్ నారిగా, ఆడు సెప్తా వుంటే నా ప్రాణం జివ్వుమని లాగిందిరో! ఆడు అబద్ధం చెప్పంగా నా కెరిక లేదు గానీ, మూడేలకు పై సొమ్ము ఒంటిమీదే నంట! నా సామిరంగా, యింట్లో యింకెంతుందో అంతు లేదంట! ఆ యింటికి కాసెయ్యాలి, ఈ చంద్రాయి పిద్రిపోవాలి!"

నారాయణకు, ఆ మాటలు వినిపించ వొళ్లు పులకరించింది. చంద్రాయి మాటలు నిజమైతే, ఆ అంజనేయులకు కొబ్బరికాయలు కోరినన్ని కొట్టనూ! అనుకున్నాడు. వీధులన్నీ దాటి, ఊరు చివరకు వెళ్తుంటే, ఎందుకో బయటకు వచ్చిన సూరపరెడ్డి, 'ఏడికిరా! నారాయణ బయలు దేరావ్?" అని అడిగాడు.

'ఏడకుంటి దొరా! మన చంద్రాయింటికి!'

'ఎం అర్ధరాత్రిప్పుడు. ప్రయాణం ముందా?"

""ఏదోలే దొరా, యిక్కడ కాదులేండి. కానామూరం! వొత్తాదొరా! ఆలీశ్యమైన దంటే ఇడెళ్ళి పోతాడు!"

పదిగజాలకవతల వొడ్డెరవాళ్ళ యిళ్ళు. అందులో వుంటాడు చంద్రాయి!

గబ గబా అడుగులేసి, ఓ చిన్నభవంతి లోకి, దారితీశాడు నారాయణ!

చంద్రాయి, వరండాలోనే మంచంమీద కూకోనున్నాడు! కళ్లు ఉబ్బి, నిప్పుకణికెల్లాగున్నాయి. గొంతునరాలన్నీ ఉబ్బి ఉన్నాయి. నారాయణను చూడగానే, మొహంలోకి, వెలుగొచ్చింది. ఈ నాయాల రాడేమొ, ఏసుకున్న పథకమంతా చెడిపోతుందేమోనని, అడిందాకట్నుంచీ, గుబులు పడుతున్నాడు. ఏనుగెక్కినంత సంబరమై, "రా! రా! హో! నీజాడ తెలక చత్తుండాను!" అని "అమ్మిగా, ఆ బుర్రిట్లా గందుకో!" అని కూతుర్ని కేకేశాడు.

"ఎందుకు మామా! కాపినేసుకున్నాలే! ఏంది? మరిలే!"

నారాయణ మాటలకు చంద్రాయ నవ్వాడు! "ఛ! ఛ! నాపయెదవ! కాసి నేసుకోట మేందిరా! సుస్తుగా తాగాలి! కత్తిబాగా నూరాలి! నూకాలమ్మకు మొక్కాలి. గుండె దైర్నంగా చేసుకోవాలి! అదిరా దొంగోడి లచ్చణం!" అని, నారాయణ కళ్ళల్లోకి, గర్వంగా, అదోలా చూసి నవ్వాడు.

అమ్మి తెచ్చిన బుర్రిదించకుండా, గటగట తాగాడు నారాయణ! వాడు తాగిన కొద్దీ, చంద్రాయి మొహం సంతోషంతో వెలుగుతోంది!

"అదిరా! పట్టు! పట్టు!" అని, "అమ్మాయ్! ఆ గూట్లోది పొడుమూ మా చొంగా, అందుకో!" అని, "ఏరా నారాయణ! గెట్లుంది సరుకు మామంచిదిలే!" అనన్నాడు.

ఎక్కుతున్న కైపు, వొళ్ళు మైకం ఎక్కిస్తున్నది. దేహం స్థిమితం తప్పి, ఎందో తియ్యని, కలల లోకంలోకి, లాక్కుపోతున్నది, నారాయణని.

బాగా నల్పి, చొంగలాగి నెట్టి, నిప్పు రవ్వ తగిల్చి, ఒక్కదమ్ములాగి, చంద్రాయి నారాయణకందించాడు చొంగ, నారాయణ రెండు దమ్ములాగి, "అసా.... లినాది! మామ! యింక.... పా!" నారాయణ లేవబోయి, తూలిపడబోయినాడు చంద్రాయి పట్టుకుని కూచోపెట్టి "ఉండహేవత్తుండా!" అని లోపటకెళ్ళి, కండువా మీదేసుకుని, కత్తి, బొడ్లోపెట్టుకుని, "చూడమ్మీ, యిల్లు జాగ్రత్త! యివ్వాళతో పీడ వొదులించుకుంటా! వస్తానేవ్!" అని, చెప్పి, "పదరా అల్లుడా!" అని యిద్దరూ బయలుదేరారు.

వూరుదాటి పొలాలకడ్డం బడ్డారు. పల్చటి వెన్నెలలో, జొన్న అకులు మెరుస్తున్నాయి, కసాయివాడి కత్తిలా, చంద్రాయి మొహంలా!

నారాయణ నిషా పెరుతున్నకొద్దీ, కాళ్ల పట్టు బట్ట అడుగులు తేలిపోతున్నాయి. చంద్రాయి వెంటపోతున్నాడు గొర్రెలాగ!

చంద్రాయి మనసులో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. వరద వచ్చిన వాగులా! మనసులో వేయిన్నొక్క దేవుళ్ళకు, పరిపరి విధాల మొక్కుతున్నాడు. నెత్తిన బెట్టుకున్న పని నెరవేర్చవుని!

చిన్నబ్బాయి కనుపించాడు కళ్ళముందు. పిచ్చికంత మనిషి, నక్కలాంటి తెలివి, ఏనుగు బలం, యిన్నిటినీ హెచ్చిస్తూ, తరగని సంపద!

నిన్నంటే, నిన్ననే కబురంపాడు చంద్రాయిని! చంద్రాయి చేతులు కట్టుకు హాజరైనాడు. "కులాసా! ఈ మధ్య కనబట్టం లేదు!" అని అడిగాడు.

"ఏదో తమ దయ కులాసాయె!"

పక్కన కూర్చున నరసింహం పంతులు, "కొత్త భార్య కదండి! ముసిలాడికి, అదంటే ప్రాణం" కన్నుగీటి చిన్నబ్బాయికి నవ్వాడు!

చంద్రాయి సిగ్గుపడ్డాడు, తప్పుచేసిన వాడిలాగ!

'అవునవును! తెలిసింది! బావుంటుందా?' తెలియనట్లు అడిగాడు చిన్నబ్బాయి!

"ఎక్కడ వలవేశాడోగానీ, రంభ అంటే నమ్మాల్సిందే! చంద్రాయి అదృష్టవంతుడు లేండి!"

"మొన్న యింట్లో అంటే నమ్మలా! ఆ! అయితే, అదృష్టవంతుడన్నమాట చంద్రాయి!" అని బదుమూపాయల కాగితం చంద్రాయి ముందు విసిరేశాడు చిన్నబ్బాయి! 'అదీ తీసుకు పో! అప్పుడప్పుడు కనిపిస్తుండు!' అన్నాడు.

చంద్రాయి, కళ్లు వొళ్లు ఆనందంతో, పులకరించింది. వొంగి వొంగి దణ్ణాలు పెట్టి, 'వొస్తాను దొరా!' అని యింటి కెళ్లాడు!

ఆ మారాజు పనిమీద, మాటకాదనలేక ఈ ప్రయాణం పెట్టుకున్నాడు!

'మామా! పడ్తెద్దంటావా?' నారాయణ అడిగాడు.

"ఛ! హో! పనిగాక ఏటవుతుంది. నాపేరేంది, చంద్రాయి! నేపుట్టినాక ఎన్ని దొంగతనాలు సేసినానో నాకెటికలేదు, ఇయ్యాల్టిదాకా, పట్టుబడతే! వూరికేరాలా" తెల్లటి పుస్తీ మీసం సవరించుకుని చెప్పాడు చంద్రాయి!

'అది సర్లే! అడు నమ్మ దగ్గ మడిశేనా?'

'ఓడు!'

'అదే దాని యేలుగాడు!'

'ఏది! ఆడి సంగత్తెద్దేమో, నిప్పుగదూ మడిసి మాటంటే, తిరుగులేదు. తిరిగితే నాలిక సఫ!'

కీచు రాళ్లు, గోలగా ఏడుస్తున్నాయి, ఆత్మీయుడు చచ్చినప్పుడు బంధుల్లాగా!

'అదేగా అంజనేయులగుడి'

'ఆ యింకెంత దూరం! అద్గదే వాగు, దాన్ని దాటితే గుడేనాయె!'

సరిగ్గా గుడికాడ కొస్తామన్నారు చిన్నబ్బాయిగారు! రాకపోతే, యింక పని జన్మలో పూర్తిగాదు!

నాల్గురోజుల్నాడు చంద్రాయి వెల్తున్నాడు. పంతులు, చిన్నబ్బాయి రిచ్చబండ కాడ కూర్చొనున్నారు. చంద్రాయి రావటం చూసి, మాటలాపారు. చంద్రాయి తెలివిగల ముండాకొడుకు. ఏందో ఆ రహస్యం తెల్సుకుందామనీ మలుపు తిరిగి గోడవార నక్కాడు.

"పోయినాడ్లే చెప్పు!"

"ఏముంది. మన నారాయణ లేడూ! వాడు! చంద్రాయి ఆడవాళ్ళని...."

ఆ తర్వాత చంద్రాయికి పంతులు మాటలు వినపడలా! కాసేపు ఆగాడు!

'నే నమ్మను!

'నేనూ నమ్మలా మొదట!'

'మరి!'

"చెప్తున్నా మొన్న మా జీతగాడు వస్తుంటే మేత మోపుఎత్తుకోని, నారాయణ, చంద్రిగాడు పెళ్లాం, దొడ్లో ములగచెట్టు క్రింద మంచం వేసుకుని, కులుకుతున్నారంట"

"ఏమొ! మనకెందుగ్గానీ! అసలీసంగతి నీకెందుకు చెప్పాడు"

"వసున్నాదానికీ! వాడు వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాడట ఈ వ్యవహారం. మనకెందుకులే ఈ గొడవ అని వూరుకున్నాడు. మొన్న మాఆవిడ, చూశారండీ, చంద్రాయి పెళ్లాం మహాచక్కటిది, గుణవంతురాలు! అని. ఏదోలేండి యిప్పటికైనావాడి సంసారం కుదుటపడ్డది! అనంది. అప్పుడీసంగతీ బయటకొచ్చింది"

"అయినాచెప్పుడు మాటలకేంలే!"

"కాదు! నిన్న మన అప్పులస్వామి చూశాడు నేనుగూడ!"

"ఏమోలే! పోనియ్యి మనకెందుకు చంద్రాయి మంచి మనక్కావలసిందంతే!"

చంద్రాయికి వందతేళ్ళు, యింకా అన్ని జెర్రులుకుట్టినయ్! ఆరాత్రి నిద్రపట్టలా! 'ఎందట్లాగుసురు గొట్టమాలె మసులుతావ్' అని విసుక్కుంది పెళ్లాం! చంద్రాయికి యిల్లెత్తు కోపమొచ్చింది. చంద్రాయి తెలివిగలవాడు. అందుకనే వాకబు చేశాడు. అడిగిన వాళ్ళంతా, నిజమే నన్నారు. అంతే! చంద్రాయి ముసలి నరాలు, కోపంతో ఉబ్బినయ్! మొహం ఎర్రగా మాడిపోయింది కళ్ళల్లో పగ కాపురముంది. యింతకాలం నమ్మి స్నేహం చేసినందులకు ఫలితం యిదా చంద్రాయంటే చండశాసనుడు. ఆ సంగతి తెలియజెయ్యాల! యిది చంద్రాయి ఆలోచన!

వాగులోకి కప్ప గభీమని దూకింది. చంద్రాయి గుండెలు గభేలుమన్నాయి. నారాయణ తేరిపార చూశాడు నీళ్ళవేపు. ఏందో అంతు చిక్కలా!

వాగుదాటి ఆంజనేయస్వామి గుడి దగ్గరకెళ్లారు. ఒంటిగా, బిక్కు బిక్కుమంటున్నది గుడి. పక్కనున్న జువ్వి చెట్లు, తుమ్మచెట్లు, తలలు విరియబోసుకు ఊగుతున్నాయ్. దయ్యంపట్టినట్లు. తుమ్మల్లోంచి, ఎవరో రావటం చూశాడు నారాయణ!

"అటు చూడు! ఓరో వస్తన్నారల్లే వుంది!"

"పిచ్చ నాయాలా! అంత ఘాటుగా ఎందుకు తాగ్గాల! బెర్లుకిమ్మి అట్లా గుంది ఈడ పొడుకో క్షణం! దానియేలు రాంగానే లేపుతా!"

నారాయణ గుడి గోడ కానుకుని, పొడుకున్నాడు. దూరంగా మాటలు, చుట్ట నిప్పు కనుపించినయ్! చంద్రాయి, కళ్లల్లో, ఆనందం మెరిసింది. ఆంజనేయులకు దణ్ణం పెట్టాడు ఊగ్రం పెంచుకున్నాడు. కత్తి సరి చూసుకున్నాడు. చొంగతీసి, నిప్పుపెట్టి, రెండు దమ్ములు

(తరువాయి 18 వ పేజీలో)

## పగ

( 16 వ పేజీ తరువాయి )

లాగి, చొంగలోని గంజాయి ప్రాణాలు పీల్చేశాడు. నారాయణ గతీ అంతే! యింకా సేపు!

అడుగో రానేవచ్చాడు! చిన్నబ్బాయి మల్లిగాదు, పోలాయి, పంతులు, యింకా యిద్దరు మా లోళ్ల, వంతులు కన్ను గీటాడు. "రెడీ" అన్నట్లు చంద్రాయి తలూపాడు అవునన్నట్లు

నారాయణ, మెళకువవచ్చి, చూశాడు ఎదురుగ్గా చిన్నబ్బాయి, మనసులో భయం కోడె త్రాచులా లేచింది, "చంద్రిగా ఏందిరా ?!,, కేకపెట్టాడు నారాయణ, కసాయి వాళ్ళను చూసిన గొర్రెలా!

"నీ మొగుళ్ళు!"

చంద్రాయి, నవ్వు వికృతంగా వినపడ్డది!

భయం, ఆతృతా, భీతి, కోపం, అసహాయిత మెదిలాయ్ ముప్పయి నాలుగేళ్ళ నారాయణ మొహంలో! "మావా! ఈళ్ల మాటలిని నా ప్రాణం తియ్యకు మావా! నీ కాళ్ల పట్టుకుంటాను.... మావా!" అన్న రోదన అరణ్యరోదనైంది.

చంద్రాయి కాళ్ళను చుట్టేసుకున్నాడు పాములాగ, నారాయణ. పదిమంది పట్టి, పైకి లేవనెత్తారు. కంఠం ఒరుసుకుపోతున్నది నారాయణకు. "మా... వా.... ఈ చిన్నబ్బాయి.... నీ.... పె........" నారాయణ శాశ్వతంగా, మాట్లాడకుండా నేలమీది కొరిగాడు, పద్మవ్యూహంలో అభిమన్యుడల్లే! నెత్తురు మడుగులో ఈదుతున్నాడు నారాయణ క్షణంసేపు. ఈ పాపం చూడలేక చంద్రుడు మేఘాల మాటున దాక్కున్నాడు.

వ్యూహం పారినందుకు, చిన్నబ్బాయి కళ్ళల్లో, ఏదో వెలుగు కదిలింది. అది చూసి చంద్రాయి బిత్తరపడ్డాడు.

## 2

మసిపట్టిన కుండ పెంకులా వుంది లోకం. చీకట్లో దారి చూసుకుంటు నడుస్తున్నాడు చంద్రాయి. మిట్టలు, పల్లాలు, పొలాలు దాటి వేగంగా నడుస్తున్నాడు. పొద్దుట్నుంచీ నడిచీ, నడిచీ కాళ్ల పూరికే లాగుతున్నయ్! కడుపులో పేగులు అరుస్తున్నయ్ అలో లక్షణా ఆకలి అని! అయినా చంద్రాయి భయపడటంలా! పైగా పల్లీకున నడవ గూడదు. పారిపోయి రావటమాయె! వూళ్లల్లోంచి అసలు రాగూడదు. అన్నిటికీ భరించి, వస్తున్నాడు వూరి పొలిమేరల వరకూ వచ్చేసరికి, చాలా పొద్దుపోయింది.

నారాయణ చచ్చి సరిగ్గా రెండేళ్లు! తను జైల్లోకెళ్ళి నెల పైగా అయింది.

"మాదరా! చంద్రాయి! నీమీద ఒట్టు! విన్ను విడిపిస్తేగాని నిద్రపోను అన్నం ముట్టను. అసూరప రెడ్డి సాక్ష్యం చెప్పకపోతే బాగుండి పోను! ఏం జేస్తాం ఖర్మ! నీకెందుకు నా మాట విను! అందరమూ జైల్లో కెళ్తే, బయట వ్యవహారం నడిపేదెవరు? అందుకనే, నీమీద మోపాం! నీ అంత గల వాడేడీ?"

చిన్నబ్బాయిని నమ్మాడు తను! కానీ ఏది ఫలితం! చిన్నబ్బాయి తన గొడవే పట్టించుకోవటంలా! పైగా, తన వాయిదా వస్తుంటే వచ్చి, తన కెదురు సాక్ష్యం చెప్పాడు. మేక వన్నెపులంటే తెలిసింది చంద్రాయికి. ఆ మనిషిలో అంత విషముందా. నమ్మించి, ద్రోహం చేస్తాడా? న్యాయాల! తనకు సాక్ష్యమూ లేక ప్లీడరూ లేక చివరకు చచ్చేదాకా జైలు శిక్ష వేశాడు జడ్జీ నేరం నమ్మి! అప్పుడు చిన్నబ్బాయి మొహంలో, కాంతి తను చూశాడు. చంద్రాయికి ఏడుపు ఉక్రోషం, వచ్చింది చిన్నబ్బాయి, తన్నెందుకు దువ్వాడో, తన చేత ఎందుకీ ఘోరం చేయించాడో, దానివల్ల అతగాడిని వచ్చిన ఫలితమేమిటో అర్థంగాలా చంద్రాయికి.

యిప్పటికీ నారాయణ కళ్లల్లోనే వున్నాడు! చువ్వలాంటి మనిషి, దొంగతనాలకు, హత్యలకు పేరు మోశాడు! ఆడు చచ్చేప్పుడు చూసిన చూపు బాకులా గుచ్చుకుంది చంద్రాయికి. అదీ జ్ఞాపకమే! దూకరా అంటే దూకే మనిషిని పోగొట్టుకున్నాడు తను. అంతె దమ్మిడీ ఫలితం లేదు. పొయ్యి పొయ్యి తను గోతిలో దిగాడు! అంతే!

చంద్రాయి వూళ్ళో కడుగుపెట్టే వేళకు నడి జాము అయింది. గొందులు సందులు తిరిగి, చిన్నబ్బాయి మేడ దగ్గరకెళ్లాడు. మేడ మీద దీపం వెలుగుతోంది. మాటలు వినబడుతున్నాయి! యినపగేటు తీసుకొని అడుగులో అడుగు వేసుకుంటూ, దొడ్లో కెళ్లాడు. మేత తింటున్న ఆవు, క్షణం వింతగా చూసి, మేత అందుకుంది పాకలో జీతగాడు కలవరిస్తున్నాడు. మొండిగోడ ఎక్కి మేడమీదకి పాకాడు చంద్రాయి. లోపల్నుంచి నవ్వులు, గాజుల గలగలలు వినపడ్డయ్! చంద్రాయి తెలివిగల ముండాకొడుకు మరీ కిటికీ వారనక్కాడు.

"వదలండీ! మరీ అంత గట్టిగానా!"

"వదిలెత్తె - నువ్వు -- పోతావు! నేను వదలను!"

చంద్రాయి, మాటలు పోల్చుకున్నాడు! కత్తి తడుము కున్నాడు!

"అబ్బ ఈబుగ్గమీద చూడండి, గంటు పడినాది!"

"చంద్రి - వంకలాగా గదూ!"

"కాదు చంద్రాయి మొహంలా!"

నేలమీదపడ్డ గాజు పీసాలా నవ్వుకున్నారు యిద్దరూ జంటగా తుళ్లిపడుతూ! ఆనవ్వుల్లో, చంద్రాయి పళ్ల కొరుక్కున్న శబ్దం మూగబోయింది.

"మరీ నవ్వకు! ఎక్కడున్నా వుంది వినగలడు!"

"యాడున్నడింకా! పెద్ద జైల్లో ముణగదీసుకు కూకునుంటడు ఏడుస్తూ! అంతే గదూ!"

"అవును! యదవ నమ్మాడు నామాట! లేకపోతే, ఆనారాయణగాడి కంతపొగరా! నన్ను చంపుతానని ప్రతిజ్ఞ చేస్తాడూ! వాడిగతేమైందో?"

(తరువాయి 27 వ పేజీలో)

ఆస్తిపరుడు తనవంటి బీద సంబంధాన్ని చేసుకుంటాడా అని అనుమానం వచ్చింది. వెంటనే అడిగాడు రాజుని.

రాజు "అవన్నీ నీకెందుకయ్యా? ఉభయఖర్చులు కూడాపెట్టుకొని పెళ్ళిచేసుకునేటట్లు అతనిని ఒప్పించే భారంనాది. అతను నామాటజవదాటడు. నీకెందుకు.... నువ్వూరుకో. అంతా పైసలు చేస్తాను" అన్నాడు.

రత్నమ్మగారు ఏదో అడ్డు చెప్పబోయింది. కాని రామారావుగారు గుడ్లెర్రజేసి "నువ్వూరుకో.... ప్రతి విషయం లోనూ కలగజేసుకోకు" అని కసిరారు. దాంతో ఆవిడనోటికి తాళం పడింది. అక్కడ ఉండి మాత్రం ఏమి ప్రయోజనమని లోపలికి వెళ్ళిపోయింది.

రామారావుగారు "సరే. నీ యిష్టం పెళ్ళిచూపులకు రమ్మని చెప్పు." అన్నారు రాజుతో.

రాజు "మళ్ళీ ఆ ఆలస్యం ఎందుకూ?" శుభస్యశీఘ్రం అని తొందరగా కానియ్యక. అయినాసరే చెప్పిచూస్తాను. అతగాడి యిష్టం. అన్ని వ్యవహారాలూ తెముల్చుకు రావడం అంటే, అతనికి కొంచెం ఇబ్బందిగానే ఉంటుందిమరి. అయినా అది అతనిఇష్టం. ఇదిమాత్రం ఒక అడ్డంకి క్రింద భావించక...." అని ఒక్క క్షణం ఆగి ఏదోజ్ఞాపకం వచ్చినట్లు 'అన్నట్లు నీతో ఒకటి చెప్పడం మరిచిపోయాను. అతనికి కూతురంటే ప్రాణం అది ఎంత చెబితే అంత. మనం ఇంత ప్రయత్నం చేసిన మీదట, అది ఒక పుల్లవేసిందంటే, చేసిందంతా వృథా అవుతుంది. కానిదానికి ధనాశ విపరీతం. దానిమొహాన్నో రెండు వందలు విసిరేస్తే, దాని నోరు కట్టడుతుంది. ఈ ఖర్చు మాత్రం నువ్వుపెట్టుకో. మిగతా ఖర్చంతా పెళ్ళిభోజనాల దగ్గరనుంచీ ఉభయఖర్చులు అతనే పెట్టుకునేటట్లు నేనుఏర్పాటుచేస్తాను. ఆ రెండు వందలూ మాత్రం సాధ్యమైనంత తొందరలో ఇప్పించు. జాగ్రత్త. ఇవన్నీ పైకి పొక్కకూడదు. కడుపులో దాచుకో" అన్నాడు గుస గుసలాడుతూ.

రామారావుగారు "నావద్దచిల్లి గవ్వలేదు. అయినా తలతాకట్టుపెట్టి, అయినా అప్పో సప్పోచేసి ఎక్కడోతెస్తాను. నువ్వుమాత్రం వ్యవహారం పొక్తపరుచు" అన్నారు.

ఆసాయంత్రమే రాజు వెళ్ళిపోయాడు.

(సశేషం)

# పగ

( 18 వ పేజీ తరువాయి )

చంద్రాయి మొహంలో ఆశ్చర్యం మెదలింది ఆ చీకట్లో!

"వాడి కేదన్నా పాపుల్ల డబ్బులిచ్చి నోరు మూయించక పోనారా?"

"అంతే చెద్దామనుకున్నా మొదట. పిల్చి పది, చేతుల్లో పెట్టా వూరుకున్నాడు. వాడికి డబ్బులు కావల్సి నప్పుడల్లా నా మీద కొస్తున్నాడు. ఎందు....కురా ఈ పీడ.... అని యివ్వనన్నాడు. చూడు నిన్నేం చేస్తానో! నీరహస్యం బయట పెడతా! చంద్రాయి నీప్రాణం తీసాడు. అడుదియ్యకపోతే నేను దీస్తా! అని బింకాలు పలికాడు!"

చంద్రాయి కళ్ళల్లో నీళ్ళ మెదిలాయి! ఆ నీళ్ళలో పగ, కోపం, జాలి కనిపించి నయ్!

లోపల్నుంచి, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువుగా వినపడ్డాయి! కిటికీలోంచి, చంద్రాయి చూశాడు. ఆ దృశ్యం చూసి దోక్కున్నాడు. తన పెళ్లాం గుడ్డలిడిచేసి, వాడి కౌగిట్లో మెలికలు తిరుగుతోంది. చంద్రాయి పెళ్ళాం నల్లటి నగ్న శరీరం చుట్టుకుని చిన్నబ్బాయి, వాళ్ళా పైన మూర్చపోయినాడు.

ఆ ఛండాలం చూడలేక కర్తవ్యతా మూఢుడై, క్రిందకుదిగి యింటికి దారి పట్టాడు. దారిపొడుగునా తన నేరానికి శిక్ష పడాల్సిందేనని, సమర్థించుకున్నాడు!

యింటి తలుపులుతీసి, లోపల కెళ్ళాడు. యిల్లంతా క్రొత్త వస్తువులతో అలంకరించి వుంది. ఎలా వచ్చినయ్యో తెలుసు! తలుపుల దగ్గరకేసి చూచున్నాడు అవతల మంచంమీద పదేళ్ళ అమ్మి నిద్ర పోతున్నది.

నారాయణ చెయ్యని పాపం లేదు. దొయ్యని కొంపలేదు, వాడి బ్రతుకే అంత! తాగుతాడు! తారుస్తాడు, కాని నిజాయితీ మనిషి!

ఆడికీ తనకు స్నేహితం పదేళ్ళు! ఈ మీసాలు తెల్లబడటం వాడికి తెలుసు! ఈ పదేళ్ళల్లో రామలక్షణుల్లా ఏ పాపం చేసినా అకృత్యం చేసినా యిద్దరూ కలిసే! అలాంటి వాడ్ని తను చేతులార హత్య చేశాడు.

తనను నమ్మి, ఆ అర్ధరాత్రి నారాయణ వచ్చాడు! తను చిన్నబ్బాయిని నమ్ముకున్నాడు! ఫలితం!

నారాయణ తనవల్ల మోసపొయ్యాడు.

తనూ అంతే!

కానీ నారాయణను చంపిన పాపం తనది. అందర్నీ శిక్షించేది ఆ భగవంతుడు! అయినా, తను నారాయణను చంపాడు! తను చెయ్యాల్సిన పని గాదది! నారాయణ పెళ్లాం పిల్లలు తన్ను యముడల్లే చూస్తున్నారు.

ఆలోచన తెగలా! అది పశ్చాత్తాపం గాదు! పరిహారం గాదు!

బుర్ర వేడెక్కింది చంద్రాయికి. కుడితిలో పడ్డ ఎలుకల్లె అయినాడు! ఏనుగంత మడిసి గోతిలోకి జేరాడు.

బొడ్లో కత్తి తగిలింది.

తలుపు తీసుకు, నూకాలు వచ్చింది!

కులాసాలు, విలాసాలు,

పరిహాసాలు, ప్రణయాలు

పూర్తయినాయి!

చంద్రాయి, కళ్ళల్లో భావం చూసి నూకాలు ఝడుసుకుంది! కత్తి తళుక్కుమంది. కేక పెట్టబోయింది. అప్పటికే నెత్తురు, ఎగిసి పడింది!

చంద్రాయి, పిచ్చుకను పిసికినట్లు, నూకాలును చంపాడు! నెత్తురు మడుగులో ఆడలాడు చున్నది, పట్టిమంచం మీదలాగ!

బావురుమని ఏడ్చాడు!

"నారాయణా వత్తుండా!" అని.

మూడుసార్లు, మూడుచోట్ల, కత్తికి, నెత్తురు రుచి చూపాడు.

జన్మచాలించాడు.

పంతులొచ్చి, మసకచీకట్లో చెప్పాడు చిన్నబ్బాయికి, "చంద్రాయి నూకాల్ని చంపి, తను చచ్చాడని!"

యిద్దరికీ అర్థంగాలా, చంద్రాయి ఎవరి మీద తీర్చుకున్నాడో "పగ!" ★